# కళాఖండం

డాక్టరు రజనీకాంత్ గది తలుపు చప్పుడైంది. "రండి" – అన్నాడతను తల చుకునే.

యువకు డొకడు చేత్తో ఏదో కాగితం చుట్టిన వస్తువు పట్టుకొని లోనికొచ్చాడు.

"నమస్కారం డాక్టర్!" అన్నాడు వస్తూనే.

"నమస్కారం. కూర్చోండి"

"మీరు నాకు ప్రాణదానం చేశారు. నిజంగా మీ ఋణం ఈ జీవితంలో తీర్చుకోలేను"– అన్నాడు యువకుడు ఆనందంతో.

"దానికేం లెండి. అది మా డ్యూటీ. ఇప్పుడు కులాసాయేనా?"

"కులాసాగానే ఉన్నాను మీ దయవల్ల! మా అమ్మకు నేనొక్కణ్నే కొడుకుని. నేను పోతే గుండె పగిలేది ఆమెకు. కాని మీ చల్లని చెయ్యి నాకు ప్రాణం పోసింది. దానికి ప్రతిక్రియ చెయ్యలేను. ఏదో ఉడుతాభక్తి. మీకోసం ప్రత్యేకంగా వెదికి వెదికి ఈ బహుమానం తీసుకొచ్చాను."

"బహుమానం ఎందుకులెండి. మీరు తృప్తిపడితే చాలు –" రజనీకాంత్.

"అలాక్కాదు. మా అమ్మకూడా మాటిమాటికీ చెప్తూనే ఉంది. మీ కేదో ఒకటి ఇవ్వాలని నా కోరిక. ఊరంతా వెదికాను. చివరకి ఇది నా దృష్టిని ఆకర్షించింది. కనీసం నన్ను సంతృప్తి పరచడానికయినా దీన్ని మీరు గ్రహించండి" అని కాగితం విప్పసాగాడు.

"ఏమిటది?"

"దంతంతో చేసిన బొమ్మ. ఇంతకంటె మీ కివ్వగలిగిన మంచి వస్తువేదీ నాకు కన్పించలేదు. చూస్తే నిజంగా ముగ్ధులవుతారు" అని కాగితం తీసి ఆ బొమ్మను టేబులు మీద ఉంచాడు.

రజనీకాంత్ ముగ్ధుడయిన మాట నిజమే – కాని అంతకంటె త్రుళ్ళిపడ్డాడు? – నిశ్చేష్టుయాడు, గాభరాపడ్డాడు. అచేతనుడయ్యాడు.

"చూశారా ఎంత బావుందో ఈ స్త్రీ విగ్రహం. ఏ అవయవమూ చెడకుండా తన జీవితాన్నంతా వెచ్చించి శిల్పి చెక్కి ఉంటాడీ కళాఖండాన్ని." ఇలా చెప్పుకుపోతున్నాడు యువకుడు. కాని ఇదంతా వినేస్థితిలో లేడు రజనీకాంత్.

"నా మాట వినండి. నాకు బహుమానమేదీ వద్దు. ఈ విగ్రహాన్ని మీరు తీసుకు వెళ్ళండి. మీ మంచితనానికి కృతజ్ఞుణ్ణి. కాని ...."

"దయచేసి దీన్ని తిరస్కరించకండి డాక్టర్! – నా మనస్సు బాధపడుతుంది" అని ఇంకా బలవంత పెట్టాడా యువకుడు.

జాలిగా అన్నాడు రజనీకాంత్ – నా పరిస్థితి కూడా కాస్త ఆలోచించండి. ఇక్కడికి ఎందరో రోగులు వస్తారు – అందులో స్త్రీలూ, పురుషులూ ఉంటారు. నా టేబిలు మీద ఈ నగ్న సౌందర్యంతో ఉన్న స్త్రీ విగ్రహం ఉంటే నా వ్యాపారానికి ఎంత ఆటంకమో యోచించండి"

"అరే! – మీలో కళాదృష్టి కాస్తైనా లేదా? ఈ విగ్రహం కోసం నేనెంతగానో తాపత్రయపడ్డాను. దీన్ని పక్కనే దీని జంటవిగ్రహం మరొకటి కూడా ఉండాలి. కాని దురదృష్టవశాత్తు అది దొరకలేదు. కనీసం దీన్నయినా మీరు తిరస్కరించకండి"

"నన్ను క్షమించండి మీరు. ఇది నా దగ్గర ఉంటే ఈ నగ్న ప్రతిమను చూసి నా భార్య నన్ను అసహ్యించుకుంటుంది. నాకు దూరమవుతుంది. నా పిల్లలు నా మీద తప్పు అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటారు. అన్ని విధాల నేను నాశనమైపోతాను."

"ప్రజల దృష్టిలో దీని మంచిచెడ్డలు ఆలోచిస్తారేం డాక్టర్. మీ మటుకు మీకు దీని గొప్పతనం తెలియడంలేదా? – వెన్నెలలాంటి తెల్లదనం, ఆమె ముఖంలో చిరునవ్వూ, వంపు తిరిగిన భుజాలూ, పాలుకారే చెక్కిళ్ళూ, బరువెక్కిన పిరుదులూ"

"కాని నా పరిస్థితి గమనించండి. నేను దీన్ని తీసుకోలేను – క్షమించండి"

యువకునికి కళ్ళనీళ్ళు తిరిగాయి. "మా అమ్మకు నేనొక్కడే కొడుకుని. నన్ను మీరు బ్రతికించారు. అందుకు చిన్న బహుమానాన్ని తీసుకోలేరా? ఇప్పుడు తిరస్కరిస్తే నేనూ, నాతోపాటు నా తల్లి ఎంత బాధపడతామో చెప్పలేను" –

నిస్పృహతో నిట్టూర్చాడు రజనీకాంత్. అంతనికేం చెయ్యడానికీ పాలు పోలేదు. టేబిలు మీద నగ్నశిలా ప్రతిమ వేయిరూపాల్లో కన్పిస్తోంది – ఏదో చెప్పబోయాడు –

"నన్ను క్షమిం..."

"మరి అడ్డు చెప్పకండి డాక్టరుగారూ! – ఇటువంటి కళాఖండం మీలాంటి వారిదగ్గరే ఉండాలి. దీన్ని మీరు తీసుకోకపోతే నేను తల బ్రద్దలు కొట్టుకుంటాను" అని అన్నాడు యువకుడు.

యువకుని పరిస్థితి చూస్తున్న కొద్దీ జాలి కలిగింది రజనీకాంత్‌కి. చివరకి చేసేది లేక మెల్లగా "సరే, దాన్నక్కడ ఉంచి వెళ్ళండి. మీ దయకు కృతజ్ఞుణ్ని" అన్నాడు.

"చాలా సంతోషం డాక్టర్! – వెళ్ళివస్తాను" అని వెళ్ళిపోయాడు యువకుడు.

రజనీకాంత్ తల తిరిగిపోతోంది. మనస్సు వికలమై పోయింది. శరీరంలో నిస్సత్తువ వ్యాపించింది. ఆలోచిస్తూ కూర్చుండి పోయాడు. ఎదురుగ్గా ఉన్న విగ్రహాన్ని పరిశీలించి చూశాడు. ఆమెలోని నగ్నత్వం మత్తు కలిగిస్తోంది. సచేతనంగా ఎదురుగ్గా మనిషి నిలబడ్డట్టయి కళ్ళు మూసుకొన్నాడొక్కసారి.

'ఇది నిస్సంశయంగా కళాఖండం. ఆ పనివాడితనం ఇక దేనికీ రాదు. దీని సౌందర్యం అపూర్వం – అంతవరకూ నిజమే. కాని ఇది తన దగ్గర ఉండడానికి తగదు. తన కార్యకలాపాలకి భంగకరం. దీనినెలా వదిలించుకోవడం? – పోనీ, లాయరు కమలాకరానికి ఇస్తే? ఆయన తన కోర్టు విషయాల్లో చాల సహాయం చేశాడు కూడాను. తనకు ప్రాణస్నేహితుడు, డబ్బు ప్రతిఫలంగా ఇస్తే బావుండదు. ఏదో వస్తురూపంగానే ఇవ్వాలి' అనుకొని రజనీకాంత్ ఆ బొమ్మని కాగితంలో చుట్టి కోటు వేసుకుని బయల్దేరాడు.

కమలాకరం ఇంట్లోనే ఉన్నాడు.

"ఏం రజనీ! ఇలా వచ్చావ్?" అన్నాడు అతణ్ణి చూడగానే.

"నీకోసం మంచి బహుమానం కొనుక్కొచ్చాను. ఇలాంటి అపూరూపమైన వస్తువుకోసం ఆరునెలలుగా గాలిస్తున్నాను. ఇన్నాళ్ళకి దొరికింది. ఈనాడు నాకెంత సంతోషంగా ఉందో చెప్పలేను" అన్నాడు రజనీకాంత్. వెంటనే బొమ్మ టేబిలు మీద తీసి ఉంచాడు.

దాన్ని చూస్తూనే దిమ్మరపోయాడు కమలాకరం.

"కాని ఇటువంటి బహుమానం ..." అని ఏదో చెప్పబోయాడు.

"ఏం? దీనికేం? – మరి అడ్డు చెప్పకు. దానిలో లోపాల్ని వెదికావంటే నేను చాలా బాధపడతాను. నాప్రాణానికి ప్రాణంగా తెప్పించాను దీన్ని. ఇంకొకడి కయితే ఇవ్వకపోదును. నువ్వు ప్రాణ స్నేహితుడివి కనుక ఇస్తున్నాను."

"మంచిది. అలాగే కాని నా విషయం ఆలోచించు. ఈ గదికి ఎందరో వస్తారు. ఎందరు పెద్దమనుషుల్తోనో నేనిక్కడ మాట్లాడుతూంటాను. ఈ నగ్నస్త్రీ విగ్రహం ఉండడం అంత మంచిదికాదేమో!"

"నీలో కళాదృష్టి కొంచెంకూడా లేదే! – దీని నగ్నత్వాన్ని మాత్రమే చూసి

ఈసడించుకొనేవాడు ఉత్తపశువు. ఆ పనివాడితనం చూడు. వెన్నెలలాంటి తెల్లదనం, ఆ ముఖంలో చిరునవ్వు, వంపు తిరిగిన భుజాలూ, పాలుకారే చెక్కిళ్ళూ ...."

"సరే, సరే, అవన్నీ బాగానే ఉన్నాయి. కాని ఈ బహుమానం నాకివ్వకపోతేనే నేను ఎక్కువగా సంతోషిస్తాను."

"ఛీ! ఛీ! నీలో సహృదయత లేదు. ప్రాణసమానంగా కొనుక్కువచ్చిన అపూర్వ కళాసృష్టిని కాలదన్నుతున్నావ్? – నా మనస్సు గాయపడుతోంది నీ మాటల్తో."

"నన్ను క్షమించు రజనీ."

"ఒక్కటేమాట. నీకు నేను బహుమానం ఇవ్వాలని వచ్చాను. ఈ విగ్రహం తీసుకొంటేనే నాతో ఇక సంబంధం పెట్టుకో. లేదా మరెప్పుడూ నాతో మాట్లాడకు" అని రివ్వున లేచాడు రజనీకాంత్.

"సరే దాన్నక్కడ వదిలివెళ్ళు" అన్నాడు కమలాకరం – చివరకి.

అతను వెళ్ళిపోయాక కమలాకరం మనస్సు పరిపరివిధాల పోయింది. టేబిల్ మీద దంతపు బొమ్మ దయ్యంలాగ కన్పించింది అతని కళ్ళకి. ఆమె నగ్నత్వం అతన్ని సిగ్గుపరిచింది. ఆ విగ్రహం మీద కాగితం కప్పి, దాన్ని వదిలించుకొనే మార్గాన్ని ఆలోచించనారంభించాడు.

చివరికి అతని దృష్టి ప్రసిద్ధ నటుడు విశ్వనాథం మీదికి పోయింది. అతనంటే, అతని నటనంటే తను పడి చస్తాడు. తనంటే అతనికి గౌరవం కూడా ఉంది. తను ఇచ్చిన దాన్ని దేన్నీ నిరాకరించడు విశ్వనాథం. వెంటనే ఆ విగ్రహం పట్టుకుని విశ్వనాథం దగ్గరికి బయల్దేరాడు కమలాకరం.

మరో మూడు గంటల్లో ఆ నగ్న స్త్రీ విగ్రహం ప్రసిద్ధ నటుడు విశ్వనాథం టేబిలు మీద నిలిచి ఉంది.

అతను నిస్సహాయంగా తలపట్టుకు కూర్చుండిపోయాడు! కమలాకరం ఎదురుగ్గా ఏమీ అనలేక బలవంతంగా పుచ్చుకొన్నాడు ఆ బొమ్మని. ఇప్పుడిక అతనికి దాన్నేం చెయ్యాలో తోచలేదు. ఆలోచించినకొద్దీ తల పగిలిపోతోంది. ఎవ్వరూ తన గదిలోకి రాకుండా తలుపులు మూసుకొన్నాడు. తననెంతగానో ప్రేమించే "చంప" వచ్చినా లోనికి రానియ్యలేదు. ఆమె మనస్సు గాయపర్చుకుని వెళ్ళిపోయింది. ఎందరో స్నేహితులు అతనిని కలుసుకోడానికి వచ్చి తిరిగి వెళ్ళిపోయారు. ఆనాడతనికి భరించరానంత తలనొప్పి వచ్చింది. మనిషి యావత్తూ క్రుంగిపోయాడు. ఏమీ తోచక మంచం మీదపడి అలానే నిద్రపోయాడు.

మర్నాటి ఉదయమే అతనికో మంచి ఆలోచన తట్టింది. వెంటనే దీన్ని ఎవ్వరూ చూడకుండా బజా[illegible]కు తీసుకెళ్ళాడు. ఎంతో కొంత ధరకి అమ్మేసి గుండె తేలికపరచుకొని ఇంటికి వచ్చేశాడు.

ఆనాటి సాయంకాలమే రజనీకాంత్ ప్రశాంతంగా తన గదిలో కాళ్ళు బార్లా జాపుకుని కూర్చొన్న సమయంలో యువకుడు పరుగెత్తుకొంటూ వచ్చాడు. అతని ముఖంలో ఆనందం తాండవిస్తోంది. ఆ సంతోషంలో క్షణకాలం మాట్లాడలేక పోయాడు.

అతనివేపు విచిత్రంగా చూశాడు రజనీకాంత్.

"నేను కృతార్థుణ్ణయ్యాను డాక్టర్. ఆనాడు మీకిచ్చిన విగ్రహానికి సంబంధించినదట. జంట విగ్రహం ఈనాడే బజారులో దొరికింది. మీకోసం ప్రత్యేకంగా కొని తీసుకొచ్చాను. ఇది తీసుకొని నన్ను సంతోషపర్చండి" – అంటూ కాగితం విప్పి టేబిలు మీద దంతపు బొమ్మను ఉంచాడు యువకుడు.

ఆ నగ్న స్త్రీ విగ్రహాన్ని చూడటంతోటే మ్రాన్పడిపోయి వెనక్కి చేరబడిపోయాడు రజనీకాంత్. అతని నోటి వెంట మాట రాలేదు.

చేసుకున్న పాపం లాంటిది చేతికొచ్చిన బొమ్మ అనుకొన్నాడు ఒక్కసారి.

---